

ప్రయాణికులపై నిఘా

ఎన్నికలవేళ రైళ్ల ద్వారా డబ్బును సులువుగా తరలించే అవకాశం ఉండడంతో డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో రైళ్లు నిలిచిన సమయంలో ప్రయాణికులను తనిఖీ చేస్తున్నారు. - 7లో



దొంగ అరెస్ట్

కొద్ది రోజుల క్రితం డోర్నకల్ పట్టణంలోని సుభాష్‌వీధిలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగను అరెస్ట్ చేసినట్లు సీఐ ఉపేందర్ రావు తెలిపారు. - 7లో

గరిష్టం/కనిష్టం $34.1^{0}/21.5^{0}$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



తొర్రూరు: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య అన్నారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలో ఓటరు చైతన్య కార్యక్రమం చేపట్టారు. ఓటు హక్కు వినియోగంపై కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ.. ప్రలోభాలకు లొంగి స్వార్థపరులు, అబద్ధాలు చెప్పే నేతలకు ఓటేస్తే వచ్చే ఐదేళ్లు ఇబ్బందులు తప్పవన్నారు. సమర్థ నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు హక్కు ఆయుధమన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బదావత్ రాజు, రాష్ట్ర కార్యదర్శి టి.హరికృష్ణ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ప్రతినిధులు దిలీప్, శ్రీనివాస్, హనుమాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా డోర్నకల్ వాసి



డోర్నకల్: హనుమకొండ జిల్లా పరకాల కోర్టు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్‌గా డోర్నకల్‌కు చెందిన కొప్పుల శంకర్ నియమితులయ్యారు. 1994 నుంచి న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న శంకర్ పరకాల కోర్టు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్‌గా నియామకం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగూడలో పోలీసుల కవాతు



కొత్తగూడ: ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని థీమా కల్పిస్తూ ఆదివారం మండల కేంద్రంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎవరికీ భయపడకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై నగేష్ ప్రజలకు సూచించారు.

7 నుంచి ఎంసీఏ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎంసీఏ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (నాన్ సీబీసీఎస్ ఎక్స్ విద్యార్థులకు) డిసెంబర్ 7 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. డిసెంబర్ 7, 12, 15, 19, 22 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇటు మోదీ.. అటు రేవంత్



సభా స్థలిని పరిశీలిస్తున్న గరికపాటి మోహన్‌రావు, హుస్సేన్‌నాయక్



సిద్ధమవుతున్న సభా వేదిక

- నేడు జిల్లాలో ఇద్దరు నేతల పర్యటన
- మహబూబాబాద్‌లో ప్రధాని మోదీ
- మరిపెడలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- ఇరు పార్టీల్లో సందడి.. జన సమీకరణపై దృష్టి

సాక్షి, మహబూబాబాద్: మరో మూడు రోజుల్లో ఎన్నికల పోలింగ్ జరగనుండగా..అన్ని పార్టీలు ప్రచారం హోరెత్తిస్తున్నాయి. కాగా సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా కందికొండ జాతరతోపాటు.. జిల్లాలో ఒక వైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన, మరోవైపు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సభ జరగనుంది. ఇందుకోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ముఖ్య నాయకులు ఈ రెండు బహిరంగ సభలకు జన సమీకరణపై దృష్టి పెట్టారు.

సభల విజయవంతంపై దృష్టి..

భారతీయ జనతాపార్టీ మహబూబాబాద్ నియోజకవర్గ అభ్యర్థి జాటోత్ హుస్సేన్‌నాయక్ గెలుపు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం



ప్రధాని మోదీ



రేవంత్‌రెడ్డి

మహబూబాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరుకానున్నారు. ప్రధాని హాజరయ్యే సభకు మహబూబాబాద్‌తోపాటు, డోర్నకల్, ఇల్లెందు, నర్సంపేట, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల నుంచి ప్రజలను తరలించనున్నారు. లక్ష మందితో బహిరంగ సభను విజయవంతం చేసేలా ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మానుకోటను చేరుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ డోర్నకల్ అభ్యర్థి జాటోత్ రాంచంద్రునాయక్ గెలుపు కోసం నియోజకవర్గంలోని మరిపెడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సభకు 30వేల మందిని సమీకరించేందుకు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇద్దరు నాయకుల పర్యటనలు ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

మోదీ సభా స్థలి పరిశీలన..

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని తాళ్ల పూసపల్లి రోడ్డులో లోటస్ మైదానంలో సోమవారం జరిగే మోదీ సభ ఏర్పాట్లను మాజీ రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, బీజేపీ మానుకోట ఎమ్మెల్యే అభ్యర్థి జాటోత్ హుస్సేన్‌నాయక్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 70 సంవత్సరాలు తర్వాత మానుకోటకు ప్రధాని వస్తున్నారన్నారు. మానుకోట పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వేలాదిగా ప్రజలు, ప్రధాని మోదీ అభిమానులు తరలివస్తారన్నారు. ఆదివాసీలు, గిరిజనులను కలవాలని, వారి మనోభావాలు, సమస్యలు తెలుసుకోవాలని మోదీ వస్తున్నారని చెప్పారు. సభను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు అశోక్, కిరణ్, కుమార్, శ్యాంసుందర్‌శర్మ ఉన్నారు.

నేడు కార్తీక పౌర్ణమి

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో భక్తులు సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకోనున్నారు. మానుకోట పట్టణంలోని ఉమాచంద్ర మౌళీశ్వరాలయం, పార్వతీరామలింగేశ్వస్వామి దేవాలయం, భక్తమార్కండేయ శివాలయం, స్వయంభు వేంకటేశ్వరస్వామి దేవాలయం వేడుకలకు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. అయా ఆలయాల్లో శివలింగాలకు లఘున్యాసపూర్వక, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు జరుగుతాయని ఆలయాల అర్చకులు తెలిపారు. దీపాలతో జ్యోతిర్లింగార్చనలు, జ్వాలాతోరణం పూజలు, శివపార్వతుల కల్యాణ వేడుకలు జరుగుతాయన్నారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా శివాలయాల్లో జరిగే అభిషేకాలు, పూజల్లో పాల్గొని పార్వతీపరమేశ్వరుల కృపకు పాత్రులు కావాలని కోరారు. శివాలయాల్లో దీపాలు వెలిగిస్తే అన్ని రకాల దోషాలు తొలిగి శుభం చేకూరుతుందని తెలిపారు.



ఉసిరికొమ్మలు కొనుగోలు చేస్తున్న భక్తులు

కొనుగోళ్ల సందడి..

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సంప్రదాయం ప్రకారం భక్తులు తమఇండ్ల వద్ద, ఆలయాల్లో ఉసిరి కొమ్మలు, ఉసిరికాయలతో దీపాలు వెలిగించాల్సి ఉండగా భక్తులు పలు ప్రాంతాల్లో ఉసిరి కొమ్మలు, కాయలు, దీపాంతరలు, ఒత్తుల కట్టలు కొనుగోలు చేస్తూ కనిపించారు. ఆలయాల్లో దీపాలను వెలిగించి తమను అనుగ్రహించాలని భక్తులు పూజలు చేసేందుకు సిద్ధమయ్యారు.

భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం

నెహ్రూసెంటర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుగులోత్ కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. దేశంలోని సబ్బండ వర్గాల ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, హక్కులను కల్పించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు ప్రతీ ఒక్కరు ఉద్యమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మంద శశి, తొప్పెట్ల వీరన్న, వాసం ఆనంద్, భీమా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నాయకుల నివాళులు

నేడు కందికొండ జాతర

కురవి: మండలంలోని కందికొండ గ్రామ శివారులోని కందగిరి పర్వత శిఖరంపై భక్తుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న లక్ష్మీనర్సింహస్వామి జాతర (కందికొండ జాతర) నేడు జరగనుంది. ఏటా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే స్వామివారి జాతరకు అధికారులు, పోలీసులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పౌర్ణమి సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించి ఆలయ శిఖరంపై అఖండ దీపాన్ని వెలిగిస్తారు. గుట్టపైకి ఎక్కేందుకు రెండు మార్గాలున్నాయి. ఆయా మార్గాల్లో భక్తులు కొండపైకి ఎక్కి స్వామివారిని దర్శించుకుంటారు. ఒక వైపు ఉన్న మార్గంలో వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. అక్కడ పూజలు చేసిన అనంతరం లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటారు. గుట్టపై ఉన్న కోనేటిలో స్నానాలు ఆచరిస్తారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు తమ ఇంటి ఎదుట దీపాలను వెలిగించి పూజలు చేస్తారు.

జాతరకు ప్రత్యేక బస్సులు

నెహ్రూసెంటర్: కార్తీక పౌర్ణమి సందర్భంగా కందికొండ జాతరకు ఆర్టీసీ డిపో మహబూబాబాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. రెగ్యులర్ నడుస్తున్న 14బస్సు సర్వీసులతో పాటు భక్తుల సౌకర్యార్థం 5ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడిపిస్తామని అన్నారు.

విల్లు ఎక్కుపెట్టిన కేంద్రహోం మంత్రి అమిత్‌షా, సభకు హాజరైన జనం



బిల్ట్‌ను తెరిపిస్తాం..

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ట్రైబల్ యూనివర్సిటీ పక్కకే..

- మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తిస్తాం
- పార్టీ అభ్యర్థి డాక్టర్ అజ్మీరా ప్రహ్లాద్‌ను గెలిపించాలి
- ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా



మాట్లాడుతున్న అమిత్‌షా, చిత్రంలో అభ్యర్థి ప్రహ్లాద్

ములుగు /ములుగు రూరల్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే కమలాపురం రేయాన్స్ బిల్ట్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ములుగు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ అజ్మీరా ప్రహ్లాద్ గెలుపు కోరుతూ.. ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన సకల జనుల విజయోత్సవ సంకల్ప సభకు అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే ట్రైబల్ యూనివర్సిటీకి భూమి ఇవ్వదని, పక్కన పెట్టేస్తుందన్నారు. ములుగు ప్రజలపై ప్రేమతో ప్రధానమంత్రి మోదీ సమ్మక్క–సారలమ్మ పేరుతో ట్రైబల్ యూనివర్సిటీకి ఆమోదం తెలిపి రూ.900 కోట్లు కేటాయించారని తెలిపారు. బీజేపీ అభ్యర్థిని ఆశీర్వదించి గెలిపిస్తే ట్రైబల్ యూనివర్సిటీని త్వరితగతిన పూర్తి చేసి భూమి ఇవ్వడంతో పాటు మరో రూ.300 కోట్లు మంజూరు చేస్తామన్నారు. గిరిజనుల అటవీ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకు రావడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలబాలికలు చదువుకోవడానికి పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు అందిస్తే సీఎం కేసీఆర్ వాటిని అమలు చేయడం లేదన్నారు. శాసనసభల్లో దేశవ్యాప్తంగా అత్యధికంగా గిరిజనులు ఉన్నారని, వారితోపాటు పనిచేసే అవకాశాన్ని తెలంగాణలో ప్రహ్లాద్‌కు ఇవ్వాలని ప్రజలను కోరారు. గిరిజన విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా 7,480 ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించామని తెలిపారు. అధికారంలోకి రాగానే సెప్టెంబర్ 17న అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ అమిత్ షా సభకు హాజరైన ప్రజలను ఉత్తేజపర్చారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్, తన సోదరి పద్మ లంబాడా సంప్రదాయ గుంగ్‌టోతో ఆయనను సన్మానించారు. అనంతరం రామబాణం అందించగా అమిత్ షా ప్రజల వైపు ఎక్కుపెట్టి చూపించారు.

అమిత్ షా పర్యటన సాగిందిలా..

- **2.25గంటలకు** సభాస్థలికి చేరుకుని అభివాదం చేశారు.
- **2.34గంటలకు** ప్రసంగాన్ని ప్రారంభించారు.
- **2.56 గంటలకు** ప్రసంగం ముగిసింది.
- అనంతరం గ్యాలరీలో ప్రజలకు అభివాదం చేశారు.
- **3.00గంటలకు** బయల్దేరి వెళ్లారు.

బీజేపీని గ్రామాల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్



బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను సభకు వచ్చిన ప్రజలు గ్రామ గ్రామానికి తీసుకెళ్లాలని అమిత్ షా చేసిన ప్రసంగం ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్ అన్నారు. నియోజకవర్గంలో తన తండ్రి దివంగత అజ్మీరా చందూలాల్ చేపట్టిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందన్నారు. ఎక్కడైతే అభివృద్ధి పనులు ఆగిపోయాయో వాటిని పూర్తి చేసి చూపిస్తానని, తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి నాయక్, స్వరూపారాణి, సురేశ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

స్థానికతే నా బలం

- ఉన్నత చదువులు చదివి సేవ చేయడానికి వచ్చాను
- నా గెలుపుతో శంకర్‌నాయక్ అరాచకాలకు చరమగీతం
- ఈ ప్రాంత సమస్యలు నాకు తెలుసు.. వాటి పరిష్కారమే లక్ష్యం
- 'సాక్షి'తో కాంగ్రెస్ మానుకోట ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య మురళీనాయక్

సాక్షి, మహబూబాబాద్: 'మా నాన్న సర్పంచ్‌గా.. జెడ్పీటీసీగా పనిచేశారు. నా భార్య ఉమ మహబూబాబాద్ మున్సిపాలిటీ మొదటి చైర్‌పర్సన్‌గా పనిచేశారు. నా కుటుంబం కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉంటూ వస్తున్నాం. దేశంలోనే ప్రఖ్యాత మెడికల్ కాలేజీ జిప్‌మార్‌లో చదివిన నేను హైదరాబాద్ వంటి పట్టణాల్లో కార్పొరేట్ ఆస్పత్రులు పెట్టుకొని డబ్బులు సంపాదించవచ్చు. కానీ ఈ ప్రాంత ప్రజలకు సేవచేయాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చాను. నేను స్థానికుడిని.. ఇదే నా బలం.. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఉన్న నమ్మకమే నా ఆయుధం' అని కాంగ్రెస్ మానుకోట ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య మురళీనాయక్ అన్నారు. ఎన్నికల సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

మా గురించి ప్రజలకు తెలుసు..

నేను స్థానికుడిని.. నా కుటుంబ సభ్యులు వివిధ హోదాల్లో పనిచేశారు. మేం ఎలా ఉంటామో ప్రజలకు తెలుసు.. ఈ ప్రాంత బిడ్డనైన నేను ఉన్నత చదువులు చదివి కూడా ఇక్కడే ఉంటున్నాను. నియోజకవర్గంలోని మహబూబాబాద్ పట్టణంతో పాటు గూడూరు, నెల్లికుదురు, కేసముద్రం, మండలాల ప్రజలతో మమేకమయ్యాను. గత ఐదేళ్లలో అందరి కష్ట, సుఖాల్లో భాగస్వామ్యం అయ్యాను. వారి ఆదరణే నాకు బలాన్ని ఇచ్చింది. వారిపై ఉన్న నమ్మకమే నన్ను ఎమ్మెల్యేగా పోటీలోకి దింపింది. వారి దీవెనల వల్లే సర్వేలో కూడా నాకు అనుకూల ఫలితాలు వచ్చాయి. ఇదంతా నా గెలుపునకు దోహదపడుతాయనే నమ్మకం ఉంది. ఈ ప్రాంత సమస్యలు నాకు తెలుసు, పరిష్కరిస్తా.

కాంగ్రెస్ అంటేనే నమ్మకం..

మా గిరిజనులకు కాంగ్రెస్ అన్నా.. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అన్నా పంచ ప్రాణాలు. కాంగ్రెస్ అంటేనే నమ్మకం. గత ముఖ్యమంత్రులతోపాటు, వైఎస్ రాజశేఖరరెడ్డి వరకు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ మేరకు నెరవేర్చారో.. నేను వేరే చెప్పనవసరం లేదు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మానుకోట యువత ఇప్పుడు ఏవిధంగా ఉన్నారో.. తలుచుకుంటేనే బాధేస్తోంది. అందుకోసమే ఇప్పుడు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన ఆరు గ్యారంటీ పథకాలు పక్కాగా అమలు చేస్తాం. అందుకోసమే ఎక్కడికి వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ జెండాను పట్టుకుంటున్నారు.. మాకు మద్దతు తెలుపుతున్నారు. ప్రజల నమ్మకం ఎప్పుడు ఓడిపోదని చరిత్ర చెబుతోంది. దీనికి తోడు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు అందరు కలిసికట్టుగా కష్టపడుతున్నారు. అందరి కష్టానికి ఫలితం తప్పకుండా ఉంటుంది.

ఎమ్మెల్యే దౌర్జన్యాలతో విసిగిపోయారు..

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని స్థానికుడు కాకపోయినా.. శంకర్‌నాయక్‌ను ఇక్కడి ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించారు. గెలిచిన తర్వాత కానీ ఆయన నిజస్వరూపం ప్రజలకు అర్థం కాలేదు. సేవచేయడం అటుపెట్టి ప్రజలపై పెత్తనం చెలాయించడం.. భూముల కబ్జాలు.. పేదల భూములు గుంజుకోవడం ఇలా ఆయన, ఆయన అనుచరులు చేయని ఆకృత్యాలు లేవు. సాధారణ ప్రజల నుంచి వర్తక, వ్యాపారులు, ఉద్యోగులు, గిరిజనులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు, స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు తోడయ్యాయి. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. కాంగ్రెస్‌ను గెలిపించాలని నిర్ణయం తీసుకున్నారు. డబ్బులు ఎరగా పెట్టి కొనాలని చూసినా.. కొనలేరు. ప్రజలు అన్నింటిని అధిగమించి నాకు.. కాంగ్రెస్ పార్టీకి.. చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తారనే నమ్మకం ఉంది.



అభివృద్ధిని చూసి ఓటేయండి



తొర్రూరు : ప్రైవేట్ టీచర్ల సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు



పెద్దవంగర : బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలతో మంత్రి ఎర్రబెల్లి

- ఆరు గ్యారంటీల కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేదు
- పాలకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి : నియోజకవర్గ పరిధి అన్ని గ్రామాల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు ప్రజలను కోరారు. ఆదివారం ఆయన మండల పరిధి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి శ్మశాన వాటిక, నర్సరీ, మొక్కల పెంపకం, సాగు, తాగు నీరు, విద్య, రోడ్ల అభివృద్ధి, వ్యవసాయానికి, మహిళలకు నిధులు, నిరుద్యోగులకు శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. నలభై ఏళ్ల తన రాజకీయ జీవితంలో నిత్యం ప్రజల కోసమే పనిచేస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా పాలకుర్తితో పాటు అయ్యంగారిపల్లి, కోతులబాధ, తిర్మలగిరి, ఎల్లరాయనితొర్రూరు గ్రామాల్లో యువతతో కలిసి మంత్రి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగిరెడ్డి, సర్పంచ్‌లు నాయని మల్లారెడ్డి, నాయకుడు చిదిరాల ధనుంజయ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

మండల పరిధి అన్ని గ్రామాలకు చెందిన దివ్యాంగులతో ఆదివారం దయాకర్‌రావు స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దివ్యాంగుల పింఛన్, ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.



పాలకుర్తి : దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

ప్రైవేటు టీచర్ల సంరక్షణకు చట్టం తెస్తాం

తొర్రూరు: ప్రైవేటు ఉపాధ్యాయులకు సంరక్షణకు చట్టం తీసుకువస్తాం.. ఇందుకు సీఎం కేసీఆర్ కట్టుబడి ఉన్నారని పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ప్రైవేటు టీచర్ల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లికి మద్దతు తెలిపారు. దయాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యా సంస్థలు, ఉపాధ్యాయుల సమస్యలపై తనకు అవగాహన ఉందని, కరోనా కాలంలో వారి కష్టాలు స్వయంగా చూశానని చెప్పారు. ఉపాధ్యాయుల సంరక్షణ చట్టం కోసం కేసీఆర్‌తో మాట్లాడుతానని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కే ఓటు అడిగే హక్కు ఉందని, ఆరు గ్యారంటీల పేరుతో ముందుకు వస్తున్న కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేదన్నారు. ప్రజలను మోసగించేందుకు సిద్ధమైన ఆ పార్టీకి పొరపాటున ఓటు వేస్తే మూడు గంటల కరెంట్, ఏడాదికో సీఎం మారడం గ్యారంటీ అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గానికి డాలర్లతో గెస్టులు వస్తున్నారని, వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామిని శ్రీనివాస్, ఆయా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, డాక్టర్ సోమేశ్వర్‌రావు, మధుకర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, రమేశ్, వేణుమాధవ్, ప్రైవేటు టీచర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

పెద్దవంగర: మండల పరిధి రాజ్‌మాన్ సింగ్ తండాకు చెందిన భూక్యా వెంకన్న, దేవేందర్, యాకూబ్, డాల్సింగ్, గంగ్యా, హము, దేవిలాల్, కృష్ణా, వెంకన్నతో పాటు హము, దేవేందర్, శంకర్, గణేష్, ప్రవీణ్, హేమాని, రేక్యా, పలువురు దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనను నాలుగోసారి గెలిపించి రాష్ట్రంలోనే పాలకుర్తిని నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు పటేల్ నాయక్, బొమ్మకల్లు ఎంపీటీసీ రవీందర్ నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా

- బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు


రాయపర్తి: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

రాయపర్తి : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, పార్టీ గెలుపునకు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన గంగారం మహేందర్, గాదె యాకయ్య, మేడి రాము, కొండేటి మధు, కొండేటి నాగరాజు, కొండేటి రాజు, గాదె ధన్‌రాజ్, కొండేటి శ్రీకాంత్, మహబూబ్‌నగర్, మైలారం గ్రామాలకు చెందిన ఆర్ఎంపీ శ్రీనివాస్ మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎర్రబెల్లి కోడలు మాలతి ప్రచారం

రాయపర్తి మండలంలోని ఏకేతండా, బాలునాయక్ తండా, సుభాష్‌తండా గ్రామాల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోడలు ఎర్రబెల్లి మాలతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలుస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్ల అభ్యర్థించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు మూడు రంగమ్మ, అమ్మిమాంజ్య, గబ్బెట బాబు, గోవింద్‌నాయక్, గారె కిరణ్, హలావత్ రమేష్, మూడు రవీందర్, వసుంధర్, సోమ నాయక్, నిమ్మల మధు పాల్గొన్నారు.

దయాకర్‌రావుతోనే అభివృద్ధి: ఎర్రబెల్లి ఉషా

దేవరుప్పుల : తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన దయాకర్‌రావును గెలిపిస్తేనే నిరంతరం అభివృద్ధి సాధ్యమని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు అన్నారు. మండలంలోని చిన్నమడూరు, అప్పిరెడ్డిపల్లె క్రైస్తవ మత బోధకులచే దయాకర్‌రావు గెలుపు కోసం ఆశీర్వచనాలు పొందారు. అనంతరం కోలుకొండలో ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి, సర్పంచ్‌లు వంగ పద్మ, సుధాకర్, కూర్నాల రవి, రైతుబంధు కోఆర్డినేటర్ కోతి పద్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మోహన్, ఖాసీమ్, ఇంద్రస్వామి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే దళిత కాలనీల అభివృద్ధి

బీఆర్ఎస్‌తోనే దళిత కాలనీలు అభివృద్ధి చెందాయని ఆ పార్టీ ఎస్సీ సెల్ దేవరుప్పుల మండల అధ్యక్షుడు మాచర్ల బాబు అన్నారు. చిన్నమడూరు గ్రామంలోని దళిత కాలనీల్లో దయాకర్‌రావు గెలుపు కోసం విస్తృత ప్రచారం చేపట్టారు.

కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయడమే లక్ష్యం

పెద్దవంగర : కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేయడమే లక్ష్యంగా పని చేయాలని తెలంగాణ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. మంత్రి దయాకర్‌రావు గెలుపునకు ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో దయాకర్‌రావును గెలిపించాలని కోరారు.

మంత్రి దయాకర్‌రావును గెలిపించాలి

తొర్రూరు : రాజకీయాల్లో మచ్చ లేని దయాకర్‌రావును మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేల్పుగొండ వెంకటేశ్ అన్నారు. పాలకుర్తి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మద్దతుగా ఆదివారం డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల వెన్నంటి ఉండే నాయకుడు దయాకర్‌రావు అని, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల కోసమే ఇక్కడ వాలిన టూరిస్టు కాంగ్రెస్ అభ్యర్థిని చిత్తుగా ఓడించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్, ఓయూ జేఏసీ అధ్యక్షుడు హరినాథ్, ప్రతినిధులు వేల్పుగొండ రామకృష్ణ, అందె రవి పాల్గొన్నారు.


దేవరుప్పుల : కోలుకొండలో ప్రచారం చేస్తున్న ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు


ఏకేతండాలో ప్రచారం నిర్వహిస్తున్న దయాకర్‌రావు కోడలు ఎర్రబెల్లి మాలతి

మార్పు రాకుంటే నిజాం పాలనే..


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి


రాయపర్తి: ఝాన్సీరాజేందర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

- కాంగ్రెస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి యశస్విని రెడ్డి
- నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతాం..
- అభాగ్యులకు ఆరు గ్యారంటీల అభయహస్తం


మాదాపురం ప్రచార ర్యాలీలో పాల్గొన్న ప్రజలు


కొడకండ్లలో ప్రచారం చేస్తున్న నాయకులు

దేవరుప్పుల : చైతన్యవంతులైన పాలకుర్తి ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పు తెచ్చుకోకుంటే నిజాం పాలన పునరావృతం అవుతుందని కాంగ్రెస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దతండా, మాదాపురం, తూర్పు తండా, దేవునిగుట్ట తండా, పాట్టిగుట్ట తండా, దుబ్బ తండాల్లో 'గడప గడపకు కాంగ్రెస్' ప్రచారంలో ఆమెతోపాటు టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా సేవా ధృక్పథం ఉన్న తమ కుటుంబానికి రాజకీయం తోడైతే ఆదర్శవంతమైన ప్రజా సంక్షేమం, అభివృద్ధి చూపిస్తామన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక కార్యాచరణతో నిరుద్యోగుల్లో వెలుగులు నింపుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసారపు ధర్మారెడ్డి, మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసాచారి, పృథ్వీరెడ్డి, అనుబంధ కమిటీల అధ్యక్షులు యాకస్వామి, సజ్జన్, ఇనుముల నాగరాజు, కొడగాని రామచందర్, రాజేందర్‌రెడ్డి, సుధాకర్, నర్సింహ్మ, శ్రీధర్, పాండు కృష్ణ, రమేష్, శ్రీనివాస్, పులిగిల్ల వెంకన్న పాల్గొన్నారు.

మైనార్టీలకు కాంగ్రెస్ పెద్దపీట

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మైనార్టీలకు పెద్దపీట వేస్తారని పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని దాదాసాహెబ్ కాలనీలో ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి గెలుపునకు ఇంటింటా ప్రచారం చేపట్టారు.

కాంగ్రెస్‌లో చేరిక

పాలకుర్తి : మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన ఓరుగంటి భాస్కర్‌తోపాటు మరో 20 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరాజేందర్ రెడ్డి వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమం

కొడకండ్ల : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి షేక్‌అబ్దుల్లా, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. ఆదివారం పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డిని గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాటకు కట్టుబడి హామీలను నిలబెట్టుకొని అమలు చేయడం కాంగ్రెస్ సొంతమని, పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో పేదల సంక్షేమం కరువైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మసురం రవీందర్, నాయకులు మనోహర్, సోమేశ్వర్, ఆగాచారి, ఉపేందర్, సైదులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడుదాం: హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి

రాయపర్తి : బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడుదామని చేతి గుర్తుకు ఓటు వేసి యశస్వినిరెడ్డిని పాలకుర్తి నుంచి అసెంబ్లీకి పంపుదామని పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని జగన్నాథపల్లి, ఊకల్, బాలాజీతండా, పానీష్‌తండా, గట్టికల్, గన్నారం, తిర్మలాయపల్లి, జేతురాంతండా, రాయపర్తి గ్రామాల్లో ఝాన్సీ రాజేందర్‌రెడ్డి దంపతులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన కోడలు యశస్వినిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, చేతి గుర్తుకు ఓటేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం..

పెద్దవంగర : కాంగ్రెస్ పార్టీ గెలిచిన వెంటనే అర్హులకు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి గెలుపునకు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

అధికారం చేపట్టగానే రుణమాఫీ చేస్తాం



గార్ల: నెహ్రూసెంటర్‌లో మాట్లాడుతున్న కోరం కనకయ్య, ఇల్లెందురూరల్: పోలారంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

గార్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని.. ఆ వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీపై నూతన ముఖ్యమంత్రి తొలి సంతకం చేస్తారని ఇల్లెందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య వెల్లడించారు. గార్లలో ఆదివారం ఆయన రోడ్‌షో ద్వారా ప్రచారం చేశారు. రాష్ట్రంలో వచ్చే నెల 9న కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరుతుందని తెలిపారు. ఈమేరకు 30న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్‌తోపాటు శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, రావూరి వెంకట్రామయ్య, దనియాకుల రామారావు, విజయసారథి, అజ్మీరా బన్సీలాల్, కట్టిబోయిన శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణగౌడ్, గుండా వెంకట్‌రెడ్డి, మాలోత్ వెంకట్‌లాల్, భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అరాచకపాలనకు అంతం పలకాలి

బయ్యారం: రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనకు అంతం పలికేలా ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య కోరారు. బయ్యారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుచేస్తామని తెలిపారు. నాయకులు సుజాత, రమేష్, కోటమ్మ, శైలజ, కుమారి, మల్లయ్య, ప్రభాకర్‌రెడ్డి, కేతమల్లు, భాస్కర్‌రావు, వీరస్వామి, కవిత, ముసలయ్య, నాగరాజు, సత్తిరెడ్డి, శ్రీను, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కోటయ్య పాల్గొన్నారు.

కనకయ్య గెలుపును కాంక్షిస్తూ ప్రచారం

ఇల్లెందు/ఇల్లెందురూరల్/టేకులపల్లి: పేదల కష్టాలు తీరాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. టీడీపీ నాయకుడు ముద్రగడ వంశీ ఆధ్వర్యాన ఇల్లెందులో ప్రచారం చేయగా కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ నాయకులు డానియేల్, పింగళి నరేష్, బంధం నాగయ్య, దేవరకొండ శంకర్, మంజుల, జాఫర్, రవి, ఈసం నర్సింహారావు పాల్గొన్నారు. ఇల్లెందు మండలం పోలారంలో జరిగిన ప్రచారంలో మండల అధ్యక్షుడు పులి సైదులుతోపాటు నాగేశ్వరరావు, ధరావత్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే, టేకులపల్లి మండలంలో భూక్యా దేవా, పూనెం సురేందర్, మంగీలాల్, ఆధ్వర్యాన కనకయ్యను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు.

బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు : హరిప్రియ


ఇల్లెందురూరల్: ప్రచారంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ,


టేకులపల్లి: పత్తి చేనులో ప్రచారం చేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: కొందరు నేతలు పార్టీకి దూరమైనా ప్రజల మద్దతు మాత్రం బీఆర్ఎస్‌కే ఉందని ఆ పార్టీ ఇల్లెందు అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ స్పష్టం చేశారు. ఇల్లెందు మండలంలోని బొజ్జాయిగూడెం, సుదిమళ్ల, పూబెల్లి, మొండితోగు గ్రామపంచాయతీల్లో ఆదివారం ఆమె రోడ్‌షో ద్వారా ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ప్రతీ గ్రామంలోనూ మహిళలు ఘనస్వాగతం పలకగా, కార్నర్ మీటింగ్‌ల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ పరిధి గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రామాల మధ్య లింక్ రోడ్లు వేయించామని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ కుటుంబానికి చేరాయని చెప్పారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు ధైర్యం చెప్పేందుకు ప్రతీ ఇంటిని సందర్శించామని గుర్తుచేశారు. దశాబ్దాల కల అయిన బస్‌డిపో సాధించగా, యువత కోసం ఐటీఐ మంజూరు చేయించుకున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్‌కు మరింత బలాన్ని చేకూర్చేలా కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని హరిప్రియ కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, జెడ్పీటీసీ వాంకుడోత్ ఉమారాణి, నాయకులు మడత వెంకట్‌గౌడ్, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, కుంజ సుగుణయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో...

టేకులపల్లి/గార్ల: బీఆర్ఎస్ ఇల్లెందు అభ్యర్థి బానోతు హరిప్రియను మరోమారు గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు బొమ్మెర వరప్రసాద్, బోడ బాలు, రామ, చీమల సత్యనారాయణ, ఆమెడ రేణుక, కిషన్, నరేష్, శ్యాం, కంభంపాటి చంద్రశేఖర్, దళపతి శ్రీనివాస రాజు, భూక్య రాధ, బసవయ్య తదితరులు పాల్గొన్నారు. ఇక గార్ల మండలంలో జరిగిన బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేష్ మాట్లాడుతూ ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పోచారం, కోట్యానాయక్ తండా పంచాయతీల్లో ప్రచారం చేయగా, ఎంపీపీ శివాజీ చౌహాన్‌తోపాటు శీలంశెట్టి రమేష్, ఎండీ.ఖదీర్, రాధాకృష్ణ, భాస్కర్‌రావు, కొండల్‌రావు, ఉమేష్, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

గోదావరికి హారతి


గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పంచరత్నాల్లో భాగంగా నాల్గోవ రోజు కార్తీకశుద్ధ చతుర్థశిని పురస్కరించుకొని గోదావరి నదికి పంచహారతి కార్యక్రమాన్ని అర్చకుడు కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గోదావరి తల్లికి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, పాలు, పండ్లు, పసుపు, కుంకుమతోపాటు సారె సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ మహేష్, సూపరింటిండెంట్ శ్రీనివాస్, ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, శ్యాంసుందర్ దేవుడా, అర్చకులు ప్రశాంత్‌శర్మ, బైకుంఠపాండా, సుబ్రమణ్యాశర్మ, రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన 'అఖండ జ్యోతి'

- కనుల పండువగా జ్యోతి ప్రజ్వలన



పాలకుర్తి టౌన్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని క్షీరాద్రి క్షేత్రమైన జనగామ జిల్లా పాలకుర్తిలో పరమ శివుడు అఖండజ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఆదివారం సాయంత్రం 6.15 గంటలకు శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో క్షీరగిరిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రమిదలో అఖండజ్యోతిని ఉత్తరకాశి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి వెలిగించారు. అంతకు ముందు అఖండ దీపోత్సవంలో భాగంగా ఆలయంలో కలశ స్థాపన, గణపతి పూజ, మండపారాధన నిర్వహించారు. అఖండజ్యోతిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ మహేంద్రకుమార్, ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, అర్చకులు పాల్గొన్నారు.

మగ బొప్పాయికి కాయలు..



కొత్తగూడ: మనుషుల మాదిరిగానే కొన్ని చెట్లలో ఆడ, మగ ఉంటాయి. అయితే మగ చెట్టు కాత కాయకుండా కేవలం పువ్వులు మాత్రమే పూస్తుంది. పర పరాగ సంపర్కం ద్వారా ఆట చెట్టు కాయలు కాస్తుంది. కాగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం జంగవానిగూడెంలో ఓ విచిత్రం చోటు చేసుకుంది. మగ బొప్పాయి చెట్టుకు పూలతో పాటు కాయలు వచ్చాయి. వాటిని చూసిన గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- చంపి రైలు ప్రమాదంలా చిత్రీకరిస్తున్నారని బంధువుల ఆందోళన


సిద్ధు(ఫైల్)


రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబీకులు

మహబూబాబాద్ రూరల్ : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని పాత కురవి గేటు ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కాగా సదరు యువకుడిని కొట్టి హత్య చేసి రైలు ప్రమాదంలో మృతిచెందినట్లు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు రాస్తారోకో చేపట్టి ఆందోళనకు దిగారు. జీఆర్పీ డోర్నకల్ ఎస్సై కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలం చంద్యా తండాకు చెందిన భూక్యా నగేష్, శారద దంపతుల కుమారుడు భూక్యా సిద్ధు(19) శనివారం అర్ధరాత్రి మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని పాత కురవి గేటు ప్రాంతంలో రైలు ఢీకొని మృతిచెందాడని తెలిపారు. సమాచారం అందిన వెంటనే తాము సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించి భద్రపరిచామన్నారు. ఆదివారం ఉదయం సిద్ధు తండ్రి నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. కాగా మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మాత్రం సిద్ధు మృతిపై అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ చేసి దోషులను గుర్తించి శిక్షించాలని కోరారన్నారు. కుమారుడి మృతికి విష్ణువర్ధన్, శివపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. విచారణ అనంతరం కేసును మహబూబాబాద్ టౌన్ పోలీసులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

బంధువుల రాస్తారోకో

భూక్యా సిద్ధు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టు మార్టం చేసేందుకు తీసుకురాగా అతడి బంధువులు, కుటుంబ సభ్యులు సిద్ధు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అండర్ బ్రిడ్జి వద్ద రాస్తారోకో చేపట్టి ఆందోళన నిర్వహించారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఊరుకోబోమని హెచ్చరిస్తూ సిద్ధు మృతదేహాన్ని పోస్టుమార్టం గది నుంచి బయటకు తీసుకువచ్చి రోడ్డుపై పెట్టి నినాదాలు చేశారు. మృతుడి తండ్రి నగేశ్ మాట్లాడుతూ.. తమ కొడుకు సిద్ధు హైదరాబాద్‌లో ఆటో నడుపుతున్నట్లు తెలిపారు. తండాలో జరిగిన శుభకా ర్యానికి హాజరయ్యాక, తండాకే చెందిన కొంద రు యువకులు అతనిని సినిమాకు వెళ్దామని మహబూబాబాద్‌కు తీసుకువచ్చారన్నారు. పథకం ప్రకారం హతమార్చి రైలు ఢీకొని మృతిచెందినట్లు వారే తమకు ఫోన్ చేసి వివరాలు చెప్పినట్లు పేర్కొన్నారు. పోలీసులు విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న టౌన్ సీఐ సతీష్, ఎస్సై విజయరాం కుమార్ మృతుడి బంధువులతో మాట్లాడి పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.